ఏకాంతం

బయట నిప్పులు చెరిగే ఎండవేడి, ఒంట్లో బాగులేకుండడం, ఇంట్లో ఆడవాళ్లు పొరుగూరు బంధువుల యింటికి విందుకు వెళ్ళడం— మొదలైన పరిస్థితులు నన్ను యింట్లో బంధించాయి ఒంటరిగా. సంఘంలో నిత్యం మసిలే అలవాటున్న మనిషికి, స్నేహితులులేనిదే క్షణం గడపలేని మనిషికి ఏకాంతంగా ఉండడం చాలాబాధే! విపరీతమైన చికాకు కలిగింది నాకు. ఆ ఒంటరితనం గడపడం చాలా దుస్సాధ్యమనిపించింది.

ఒక్కసారి ప్రక్కమీద పడుకుని ఏమీ తోచక లేచి తిరిగాను. తిరిగి విసిగెత్తి వెళ్ళికుర్చీలో జార్లగిలబడ్డాను.

“ఏయ్!” ఎవరో పిలిచారు రెపరెపశబ్ధం చేసుకుంటూ.

ఎదురుగా టేబిలుమీద వార్తా పత్రిక గాలికి రెపరెపశబ్ధం చేసుకుంటూ, వెయ్యినల్లకళ్ళు చిలిపిగా కదుపుతూ పిలుస్తోంది.

“కబుర్లుచెప్పవా” అడిగింది వార్తాపత్రిక.

నా చేతులు ఆనందంతో పత్రికచేతులతో కలిసేయి. పత్రికలోని నల్లటి అక్షరాలకళ్ళు నాకళ్ళలోకి తొంగిచూశాయి.

“ప్రపంచ” సమరం త్వరలోరాదు.

అమెరికానుంచి ఒక ప్రసిద్ధ నాట్యకత్తె వచ్చి బొంబాయిలో ప్రదర్శనలిచ్చింది.

ఒక రాజకీయవేత్త పరిస్థితులమీద కోపంతో రాజీనామా యిచ్చాడు పదవికి.

అత్యాచారాలు అరికట్టాలని ఒక ముసలివాడు సత్యాగ్రహం సలుపు తానని ప్రతినపట్టాడు.

కావాలి ఒక ఇరవైపైఏండ్ల అందమైన చదువుకున్న తెలుగు అమ్మాయికి ఉద్యోగంచేస్తూ హాయిగా బ్రతకగలిగే ముప్ఫయ్యేండ్ల వరుడు కావాలి. కులంతో నిమిత్తంలేదు.

ఒక మగవాడి శవం హుస్సేనుసాగరులో తేలింది.

హిహిహి! ఎల్లావున్నాయి నాకబుర్లు అడిగింది వార్తాపత్రిక.

వనపోసిన పిట్టలా అనవసరమైన తనగోడవలు బలవంతంగా చెప్పుకు పోయే స్నేహితునిలా విసుగు కలిగించాయి ఆవార్తలు వార్తలరూపాలు రోజురోజుకు వేరైనా అంతరార్థాలు ఒకటే. స్నేహానికి అవసరమై పర స్పరంగా అభిరుచి ఉన్న విషయ చర్చవదిలి, ఒక్క తనగోడవ, గోడు వినమని, బలవంతపెట్టే స్నేహితునితో ఎంతకాలం గడపగలం!'

'నీకో నమస్కారం! సెలవు' అన్నాను.

'నన్నర్థం చేసుకోలేని స్నేహితుడు నాకూ అనవసరం!' కోపంతో విసురుగా పోయింది. టేబిలుమీదకు వార్తాపత్రిక.

వీపుమీద చురుక్కుమని వేళాకోళంగా ఒక గిల్లుగిల్లేరు ఎవరో!

"ఏం కులాసాగా ఉన్నావా? నిన్నువెన్నంటి తిరుగుతున్నా ఎక్కడా గుర్తు పట్టినట్టు లేదు!"

నలుపు శరీరం మీద ఎరుపురంగు పూసుకుని, షోకుగానుంచిని, వయ్యారంగా తనతొండం త్రిప్పుతూ కుర్చీగుడ్డమీద నృత్యంచేస్తున్న నల్లి కనిపించింది.

'ఓహో! నువ్వా!' అన్నాను.

'గుర్తు పట్టావన్నమాట! జ్ఞాపకముందా?'

'జ్ఞాపకం కలిగించావు!'

'మరి ద్రాక్షపండ్లు, ఆపిలుపండ్లుతిని దిట్టంగా శరీరం పెంచుకుని, మత్తుగా మసిలే స్నేహితుణ్ణి గిల్లకపోతే వలుకుతాడూ? అందుకే గిల్లాను!' అంటూ వకవక నవ్వుతూ తొండం ముందుకు వెనుకకు ఊగిసలాడిస్తూ అన్నది నల్లి.

'చాలా హుషారుగా ఉన్నావే?'

'నీరక్తం చాలా తియ్యగా ఉందిలే! మత్తుకలిగి నృత్యంచేయ బుద్ధి పుడుతోంది.

'నెత్తిమీద మొట్టితే అమత్తు పోతుందేమో! కదూ!'

'మొట్టుచూద్దాం?' గట్టిగానవ్వుతూ ఎగిరింది నల్లి! నా రెండు చేతులు నల్లి తలమీదకు ప్రాకాయి.

'పట్టుకో చూద్దాం!' అంటూ నల్లి లేడిలా పరుగెత్తింది.

'ఆగు' అరచాను.

'పట్టుకో!' అంటూ నల్లి పరుగెత్తి కుర్చీలోదూరి తొంగిచూస్తోంది హేళనగా నవ్వుతూ.

'మా బలేస్నేహితుడివి లే,' అన్నాను వ్యంగ్యంగా.

'టాటా'!' అంటూ తొండంఊపింది నల్లి 'మళ్ళీ కలుసుకుంటాగా' అన్నట్టు.

ఎదురుగా టేబిలుమీద బంగారు రంగులో ఒక సిగరెట్టుకేసు తళతళా మెరుస్తోంది ప్రేయసి కన్నుల్లా! పెట్టెలో ఏదో చప్పుడవుతోంది. విప్పిచూశాను. లోపలబంధించానన్న కోపంతో, బద్దకంగా పడుకున్న సిగరెట్టు. సిగరెట్టుకేసును చిలిపిగా తన్నుతోంది. కేసు విప్పగానే, లేచి కూర్చోని ముద్దుపెట్టుకోమన్నట్లు చేతిలోకి గెంతింది వయ్యారంగా.

నా పెదాలమధ్య బంధించాను సిగరెట్టును.

ఆ స్పర్శ సుఖంతో అగ్నిజ్వాల రేగింది.

సుడులుతిరిగిన పొగలా, రింగుల్లా గాలిలో తేలుతోంది. ఒక్కొక్క పొగరింగులో ఒక్కొక్క ప్రతిబింబం! ఎప్పుడో చూచిన ముఖాలూ మెదడులోపల దాక్కున్న ప్రతిబింబాలు!

ఒక పొగరింగు సొగసుగా గాలిలో నృత్యంచేసింది!

అదులోంచి ఒకముఖం నవ్వింది.

'నమస్కారమండి' నవ్వు వెలిగింది.

ఆ పొగరింగు పూర్తిగానిండే గుండ్రనివదనం, పూర్ణమైన చంద్ర బింబంలా! హృదయాలు గాయాలు పరచకుండా జాగ్రత్తపడడానికి తళతళ మెరిసేకళ్ళు కప్పుతూన్న నల్ల కళ్ళద్దాలు, చంద్రబింబంలోని మచ్చల్లా! చంద్రబింబాన్ని అల్లుకున్న నల్ల మేఘాల్లా నొక్కునొక్కుల

నల్లనిజుట్టు!! ఆకాశరాజ్యంలో పరుగిడుతున్న చంద్రబింబంలా బస్సులో వేగమైన ప్రయాణం!! నాల్గుసంవత్సరాల క్రితం నాజుకుగా, బక్కగా, పొట్టిగాఉన్న ఆ అమ్మాయి దిన దిన ప్రవర్థమానమైన చంద్రవంకలా సంపూర్ణంగా ఆనిండు యౌవన వదనం పొగ రింగులోంచి తొంగిచూచింది.

'నమస్కారమండీ!' మళ్ళీ నవ్వింది ఆమె.

అది ఒక్క నమస్కారబాణమే కాదనిపించింది!

నవ్వుకున్నా ఆనందంగా:

చెయ్యి చురుక్కున కాలింది.

పరస్త్రీమీద వ్యామోహం చూపించిన నామీద కోపగించి నాదగ్గర ఉన్న సిగరెట్టు అసూయలో దహించుకుపోయింది. అమాయకంగా దహించుకుపోయిన దాని ఉసురు నన్ను చురుక్కుమని కాల్చింది.

గబుక్కున కింద రాల్చాను ఆ సిగరెట్టు ముక్కను, గతించినప్రేమ ఉబికి జాలిగా మారింది ఆ ముక్కపైన.

అందని ప్రేమవల్ల అవ్యక్తమైన బాధ ఎంతో కలుగుతుంది.

ఆ సిగరెట్టు పొగరింగులు గాలిలో తేలుతూ దూరంగా దూరంగా నా కంటిముందే పయనించి మాయమైపోయాయి. నాకు ఎంతో బాధకలిగింది.

నా గుండెక్షణం ఆగి, మళ్ళీ ప్రసారం ప్రారంభించింది.

నా గుండె చప్పుడులాగే ఎదురుగా గడియారం టిక్కు టిక్కుమంటూ కొట్టుకుంటోంది.

'ఏమి! తోచటంలేదూ? అంటూ నానెత్తిని దూసుకుంటూ చలాకీగా ఎగిరి కిటికీలో నుంచుంది పిచ్చుక ఒకటి.

'తోచటంలేదూ? పాటపాడనా?,' లాలించింది పిచ్చిక.
'ఊ' అన్నాను పాటైనా విందామని.

'చుప్‌చిప్ చుప్‌చిప్!' అంటూ గడియారం టిక్కు టక్కుల వంటి మద్దెల శబ్దానికి అనుగుణ్యంగా పాడుతూ నృత్యంచేసింది పిచిక.

'ఎలాగుంది?' అడిగింది పిచిక.
'బాగుంది!' అన్నా ను భావంగా.

మళ్ళీ పాడనా! చిప్‌చుప్, చిప్‌చుప్!' గాలిలో తల్లక్రిందులుగా మొగ్గలేసింది. పిచిక, పాడుతూ!

'ఎందుకు నీ కింత శ్రమ?' అన్నా.

'నీస్నేహం మరచిపోగలనా? నీయింట్లో నాగూడు కట్టుకోడానికి స్థలంయిచ్చి ఆదరించారు నాపిల్లలు ఆగూటిలో సుఖంగా ఉన్నారు! నీ ఆదరణ, ఋణం ఎలా తీర్చుకోగలను?' అంది అమాయకంగా పిచిక.

నీ పిల్లలు ఎదిగాక వాళ్ళచేతకూడా నృత్యప్రదర్శనం చేయించు నాయింట్లో!' అన్నా నవ్వుతూ.

'తప్పకుండా' అంటూ వాగ్దానంచేసి, ఆనందంగా పాడుతూ ఎగిరి పోయింది పిచిక.

అలమరు కిర్రున చప్పుడయింది. ఏమిటీ! అలావున్నావు?' అంటూ సాగదీసుకుంటూ

తక్షణం చేతులు చాచుతూ ఎగిరి నామీద పడింది ఒక పుస్తకం.

'నేవున్నాగా నీ కాలక్షేపానికి! నిన్ను మరో లోకంలోకి తీసుకు వెడతా!! 'ఊ నన్ను పరీక్షించు,' ఆత్రుతతో అల్లల్లాడింది కదిలే పేజీల చేతులు త్రిప్పుతూ, ఆ పుస్తకం.

రెండు పేజీలు త్రిప్పాను మౌనంగా.

అనగనగా ఒక రాజు ఆ రాజుకు ఏడుగురు కొడుకులు. పాతకథే

ఒక అమ్మాయిని ఒక అబ్బాయి ప్రేమించేడు. ఆమె ప్రేమించ లేదు. భగ్నహృదయం!

ఆ రాజు ఇంద్రుడు, చంద్రుడు లాంటివాడు. ఆ దాసి నీచురాలు మూర్ఖురాలు! మునుపటి అభిప్రాయాలే!

బూజుపట్టిన పాత కథలు, పరిపాటైపోయిన ప్రణయ కలాపాలు; విలువలేని బాహ్యమైన అభిప్రాయాలు, మారాలి! పుస్తకం విసిరేశాను, పుస్తకం గిలగిల తన్నుకుని ఒకమూలగా ఒరిగింది.

పాడైపోయిన రేడియో రోగిష్ఠిదైన విశ్వాసమైన కుక్కలా ఎదురుగా మూల్గుతూ నాకేసి చూస్తోంది 'నీ కేమీ సంతోషంకలిగించలేను ప్రస్తుతం!' అంటూ.

చికాకు పెరిగింది.

మెదడులో ఏదో తుపానులాంటి సంచలనం కలిగింది. ఒక మెరుపు మెరిసింది ఎవరో వచ్చినట్లు.

'ఎవరు?'

'నీ స్నేహితుణ్ణి!'

'పేరు?'

'ఆలోచన! నేను నీ వెంటే ఉన్నా, నే నట్టే మసిలు తూండడం నీ కలవాటయి పోయింది!'

'నామీద అంత అభిమానమా?'

'ఓ!..., సినిమాకి వెడదామా?'

'ఒంట్లో బాగ లేదు! రాలేను?'

'అయితే యిక్కడే చూపిస్తా సినిమా!'

'ఎల్లాగ?'

'ఒక్కసారి కళ్ళుమూసుకు తెరు!'

'ఊ'

శివాలయం—పూజారి మాష్టారు పాఠాలు చెబుతున్నారు—ఆఫీసరుగా అమ్మాయి పుస్తకాలతో వచ్చింది—నిమ్మతొనలు పంచిపెట్టింది కుర్రాళ్ళకు ఆ అమ్మాయి అందరూ మాష్టారికి తెలియకుండా తింటు న్నారు...నాకు దొరక లేదు...ఉడుకుమోతులా అసూయతో అరిచాను 'నాకో' అని...మాష్టారు విన్నారు ..పేము బెత్తంతో వచ్చారు...అరిచి నందుకు నన్ను, స్కూల్లో నిమ్మతొనలు తింటున్న పిల్లలనూ గట్టిగా కొట్టారు. దెబ్బలు తగలినా నిమ్మతొనలు దొరక లేదని విచారించాను... ఎక్కడుందో ఆ అమ్మాయి!

మానాన్న...పొట్టిగా లావుగా బుట్టతలతో, చిన్న బొజ్జతో నవ్వుతూ కనిపించాడు.

'చుట్టకాలుస్తావురా?' అడిగాడు.

ఒకటి వాసన చూశాను.

'ఈ దురలవాటు వాడికి కూడా నేర్పండి!' మాఅమ్మ కోపంతో నవ్వింది.

'పోనీ వాడ బదులు నువ్వు కాల్చు' అంటూ నాన్నచుట్ట చేతి కిచ్చాడు మా అమ్మకు.

'అబ్బ! మీకు అన్నీ యిటువంటి వేళాకోళాలే!' ఆమె సిగ్గుతో నవ్వింది.

అమ్మచేత చుట్టకాల్పించు నాన్న!' అన్నాను.

'ఓరి వెధవ!' అంది అమ్మ! నాన్న నవ్వు! తెగ నవ్వాడు నాన్న చనిపోయిన నాన్న ఎక్కడున్నాడో!!!

'ఏమండి! మీకు ఆ లుంగీకట్టుకుంటే వంటవానిలా ఉన్నారు!

'తమరు ఆ తెల్లచీర కట్టుకుంటే హాస్పిటలులో నర్సులా ఉన్నారు

'మీకు నాకు వంటచేసి పెట్టండి నేను మీకు వైద్యం చేస్తాను!'

'ఆ ఈకాలపు ఆడవాళ్ళు అంతా యింతేలే!!'

ఆమె కిల కిల నవ్వింది.

ఎవరు?

కాబోయే భార్య!

బాగుంది! ఎక్కడుందో!!

ఉష్! చికాకేస్తుంది. సినిమా తొలగిపోయింది.

కాళ్ళగజ్జెలు ఘల్లున శబ్దంచేస్తూ నిలయతాండవంతో పూగినలా డుతూ, తన హస్తాలలోకి తీసుకుంది నన్ను ఒక మహాసాధ్వి! మళ్ళీనృత్యం

చేసింది!! ఆ నృత్యంలో ఊగిసలాడిపోయాను!! అయినా ఆ నృత్యం లయ తాళాలలో సన్నని మైకం. తూలించేమత్తు, తేలి పోయే హాయి, అనుభవించాను. ఎంతో ఆనందంగా ఉంది.

'నీ పేరు' ఆమెను అడిగాను.

'నిద్రా దేవత!'

'నువ్వంటే నాకెంతోయిష్టం! నిన్ను ఎప్పుడూ పూజిస్తాను నేను!'

'నీకు వరం యివ్వనా? నువ్వు నన్ను తల్చుకుంటే చాలు, ఆనందంగా నృత్యం చేస్తా నీకోసం!' ఆమె గంభీరమైన పెద్ద వదనంలో నుంచి మందహాసం వెలిగక్కింది. ఆ మందహాసం నన్ను సమ్మోహనం చేసినట్టు మైమరుపు కలిగించింది.

'ఠన్ ఠన్' తలుపు చప్పుడు.

'ఓరేయ్ సత్యం గుమ్మంలో అరుపు.

మసిపిలాంటి స్నేహితుడు, వచ్చాడు. బయటినుంచి పిలుస్తున్నాడు. ఏకాంతం సడలిపోయింది. మిత్రుని రొదకన్న ఏకాంతంలో స్నేహితులే మంచివాళ్ళనుకుంటూ, చిరాకుతో వెళ్ళి తలుపుతీశాను తప్పనిసరిగా.